# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

ఆదివారం 4 మే 2025 www.prajaswaramdaily.com 4 pm


# కాంగ్రెస్‌లో విభేధాలు

**మంత్రి ఎదుటే ఇరువర్గాల వాగ్వాదం**

**ఎమ్మెల్యే రామ్మోహన్ కు పటాన్‌చెరు పార్టీ నేతలకు మధ్య గొడవ**

సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఇందిరమ్మ కమిటీల మధ్య విభేదాలు చెలరేగాయి. మంత్రి దామోదర రాజనర్సింహ ముందే హస్తం పార్టీ నాయకులు గొడవకు దిగారు. ఇందిరమ్మ కమిటీల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకి అన్యాయం జరుగుతుందని జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ ఆగం చంద్రశేఖర్ చెప్పుకొచ్చారు. వెంటనే కల్పించుకుని అలా ఏమీ ఉండదు.. ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకి న్యాయం చేస్తామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చెప్పారు. ఇక, ఇందిరమ్మ కమిటీలో పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పెత్తనం ఏంటని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. ఆయన బీఆర్ఎస్ నాయకులకే న్యాయం చేసి నిఖార్సైనా కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. దీంతో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి పటాన్ చెరు కాంగ్రెస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. రంగ ప్రవేశం చేసిన పోలీసులు గొడవను సద్దుమణిగేలా చేశారు.

# ఆర్టీసీ కార్మికులతో చర్చలకు సిద్ధం

**5, 6 తేదీల్లో కార్మికులు ఎప్పుడు వచ్చినా సమస్యలపై చర్చిస్తా**

**ప్రజల సౌకర్యం కోసం ప్రజాపాలన**

**ఇబ్బందికర పరిస్థితులు తేవద్దు**

**మంత్రి పొన్నం ప్రభాకర్**



హైదరాబాద్ : ఆర్టీసీ కార్మికులతో చర్చలకు సిద్ధం అని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణలో ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగించేందుకు కార్మికులు రెడీ అయ్యారు. ఈ నెల 07 నుంచి సమ్మెకు దిగనున్నట్లు ప్రకటించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ బస్టాండు పరిసరాలను సందర్శించి, ప్రయాణికులతో ముచ్చటించారు. ఆర్టీసీ కార్మికులతో చర్చలకు సిద్ధం, సీఎం ఆదేశాల మేరకు 5, 6 తేదీల్లో కార్మికులు ఎప్పుడు వచ్చినా సమస్యలపై చర్చిస్తామని అన్నారు. ఆర్టీసీ సంస్థ కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం కోసం ప్రజా పాలన ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు. 10 సంవత్సరాలుగా ఆర్టీసీ నిర్వీర్యం అయిపోయిందన్నారు. ఇప్పుడిప్పుడే లాభాల బాటలో నడుస్తుందన్నారు. కార్మికులు కూడా సహకరించాలి అని అని కోరారు. సంస్థ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం అనే మూడు ముఖ్య ఉద్దేశాల మీద సంస్థ నడుస్తోందన్నారు.. రాష్ట్రంలో ఉన్న ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, ఆర్టీసీ ఇప్పుడే ముందుకు వెళ్తున్న తరుణంలో మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్టు ఇబ్బందికర పరిస్థితులు తేవద్దని ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ డీజీపీపై వివాదాస్పద వ్యాఖ్యలు

# యూట్యూబర్ అన్వేశ్ పై కేసు

**అవినీతి ఆరోపణలు**

**300 కోట్లు కొట్టేశారంటూ వీడియో..**

**నిరాధారమైన ఆరోపణల నేపథ్యంలో కేసు రిజిస్టర్**



హైదరాబాద్ : యూట్యూబర్, ప్రపంచయాత్రికుడు అన్వేశ్ చిక్కుల్లో పడ్డాడు. అన్వేశ్ పై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి గల కారణం తెలంగాణ డీజీపీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడమే. హైదరాబాద్ మెట్రోలో బెట్టింగ్ యాప్‌ల ప్రచారం పేరుతో రూ.300 కోట్లు కొట్టేశారంటూ వీడియోలో ఆరోపణలు చేశారు. ఐదుగురు ఐఏఎస్ లతోపాటు డిజిపి 300 కోట్ల రూపాయలు కాజేసారని ఆరోపించాడు. నిరాధారమైన ఆరోపణలు చేసినందుకు అన్వేష్ పై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇటీవల అన్వేష్ బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసిన సెలబ్రిటీల పేర్లను రివీల్ చేస్తూ వీడియోలు చేశాడు. ఆ తర్వాత పలువురిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఇప్పుడు ఏకంగా ఉన్నత స్థాయి అధికారులపై ఆరోపణలు చేయడంతో ఈ వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది. అన్వేశ్ చేసిన ఆరోపణల్లో నిజం ఎంత అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఒక వేళ నిజం అని తేలితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందంటున్నారు. మరోవైపు బాధ్యాతారహితంగా వ్యయవహరించిన అన్వేష్‌పై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రధానితో ఎయిర్ చీఫ్ మార్షల్ భేటీ

**ఢిల్లీలోని ప్రధానమంత్రి నివాసంలో సమావేశం**

**పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో వరుస సమావేశాలకు ప్రాధాన్యత**



న్యూఢిల్లీ : ఉగ్రదాడి తర్వాత సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ప్రధాని నరేంద్ర మోదీతో భారత ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ భేటీ అయ్యారు. ఢిల్లీలోని ప్రధానమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఇక, ఉగ్రదాడి అనంతరం దాయాది దేశాన్ని భారత్ అన్ని వైపుల నుంచి దిగ్బంధనం చేస్తున్న విషయం తెలిసిందే. విడతల వారీగా తీసుకుంటున్న పలు నిర్ణయాలతో పాక్‌ను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. దీంతో భారత్ ఎప్పుడు దాడి చేస్తోందనని పాక్ వణికిపోతోంది. మరోవైపు, భారత్ చర్యలపై ప్రధాని మోదీ వరుసగా ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా భారత్ ఎయిర్ చీఫ్ మార్షల్‌తో భేటీ అయ్యారు. శనివారం నాడు నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కే త్రిపాఠితో కూడా మోదీ సమావేశమైన విషయం తెలిసిందే.

అలాగే ఉగ్రదాడి నేపథ్యంలోనే భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీ కూడా జరిగింది. ఉగ్రవాదులపై చర్యలు తీసుకునేందుకు త్రివిధ దళాలకు ఈ భేటీలో కేంద్రం పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. ఇక శుక్రవారం నాడు యుద్ధ సన్నద్ధతలో భాగంగా ఉత్తరప్రదేశ్‌లోని గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై వాయుసేన యుద్ధ విమానాల ల్యాండింగ్, టేకాఫ్ విన్యాసాలను నిర్వహించింది.

# శ్రీనగర్ వెళ్తుండగా..

**లోయలో పడిన ట్రక్కు - ముగ్గురు జవాన్ల మృతి**



కశ్మీర్ : ఆర్మీ ట్రక్కు జమ్మూకశ్మీర్‌లోని రాంబన్ వద్ద లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు జవాన్లు మృతి చెందారు. జమ్మూ నుంచి శ్రీనగర్‌కు వెళుతున్న ఆర్మీ వాహనం.. 'బ్యాటరీ చెష్మా' అనే ప్రదేశం వద్ద 600 అడుగుల లోయలోకి దొర్లిపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకొంది. ఆ వాహనంలో ప్రయాణిస్తున్న జవాన్లు చనిపోయినట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. మృతి చెందిన సైనికులను అమిత్ కుమార్, సుజిత్ కుమార్, మన్ బహదూర్‌గా గుర్తించినట్లు సైన్యం వెల్లడించింది. సహాయక చర్యలు చేపట్టేందుకు పోలీస్, ఆర్మీ, ఎస్‌డీఆర్ఎఫ్, సివిల్ క్యూఆర్టీ బృందాలు రాంబన్‌కు బయల్దేరినట్లు అధికారులు వెల్లడించారు.

# వరికోత యంత్రం ఢీకొని బాలుడి మృతి

**మెదక్ జిల్లాలో విషాదం..**



చేగుంట: మెదక్ జిల్లా చేగుంట మండలం ఇబ్రహీంపూర్‌లో విషాదం చోటుచేసుకుంది. వరికోత యంత్రం ఢీకొని నాలుగేళ్ల బాలుడు మృతి చెందాడు. ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడిని వరికోత యంత్రం ఢీకొనడంతో ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఘటనకు కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# చిన్నారికి 'సల్లేఖన దీక్ష'

**కొంతకాలంగా బ్రెయిన్ ట్యూమర్ తో బాధపడుతున్న పాప**

**మత గురువు సూచనలు, తల్లిదండ్రుల అనుమతితో దీక్ష**

**ఈ దీక్ష ఇవ్వడంపై నిపుణుల ఆందోళన**



భూపాల్ : మాటలు కూడా పూర్తిగా రాని మూడేళ్ల చిన్నారికి సల్లేఖన దీక్ష ఇవ్వడం మధ్యప్రదేశ్ లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జైన మత విశ్వాసాల ప్రకారం.. ఆహారం, నీరు తీసుకోకుండా శరీరాన్ని కృశింపజేసుకుంటూ మరణాన్ని ఆహ్వానించడమే సల్లేఖనం లేదా సంతారా. సాధారణంగా వృద్ధాప్యం పైబడిన వారు ఈ దీక్ష ద్వారా మరణాన్ని స్వచ్ఛందంగా ఆహ్వానిస్తారు. అయితే, మధ్యప్రదేశ్ లోని ఇండోర్ లో ఓ మూడేళ్ల పాప వియానా జైన్ తో ఆమె తల్లిదండ్రులు ఈ దీక్ష నిర్వహించారు. బ్రెయిన్ ట్యూమర్ తో బాధపడుతున్న వియానా సల్లేఖన దీక్ష ప్రారంభించిన పది నిమిషాల్లోనే తుదిశ్వాస విడిచింది. ఈ ఘటన ఇప్పుడు అనేక నైతిక, చట్టపరమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఐటీ నిపుణులైన పీయూష్, వర్షా జైన్ దంపతుల ఏకైక కుమార్తె వియానా. గత డిసెంబర్‌లో చిన్నారికి బ్రెయిన్ ట్యూమర్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. ముంబైలో శస్త్రచికిత్స సహా చికిత్స అందించినప్పటికీ పాప కోలుకోలేదు. రోజురోజుకూ పాప పరిస్థితి విషమించడంతో జైన మత విశ్వాసులైన ఆ కుటుంబం ఆధ్యాత్మిక మార్గాన్ని ఆశ్రయించింది. మార్చి 21న ఇండోర్‌లోని జైన ఆధ్యాత్మిక గురువు రాజేష్ ముని మహరాజ్‌ను కలిసినప్పుడు, ఆయన సూచన మేరకు చిన్నారికి 'సల్లేఖన' నిర్వహించారు. "మా అంగీకారంతోనే 'సల్లేఖన' జరిగింది, పది నిమిషాల్లోనే వియానా మరణించింది" అని ఆమె తల్లి వర్షా జైన్ తెలిపారు.

# నక్సల్స్ తో మాటల్లేవు... మాట్లాడుకోవడాల్లేవ్

**ఆపరేషన్ కగార్ ఆగదు**

**ఆయుధాలు వీడాల్సిందే.. లొంగిపోవాల్సిందే**

**మాట్లాడే ప్రసక్తే లేదు**

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కామెంట్స్**



హైదరాబాద్ : ఆపరేషన్ కగార్ ఆగదు... మావోయిస్టులు ఆయుధాలు వీడాల్సిందే... లొంగిపోవాల్సిందేనని కేంద్రమంత్రి బండి సంజయ్ తేల్చిచెప్పారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆపరేషన్ కగార్ పై హాట్ కామెంట్స్ చేశారు. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ.. మావోలతో చర్చలు జరిపే ప్రసక్తే లేదు.. నక్సల్స్ హింసలో ఎందరో లీడర్లు చనిపోయారు... పోలీసులు చనిపోయారు... అప్పుడు చర్చల గురించి.. మావోయిస్టులకు మద్దతుగా కేసీఆర్, రేవంత్ ఎందుకు మాట్లాడలేదు.. మావోయిస్టు పార్టీ నిషేధ సంస్థ వారితో చర్చలు ఉండవు. పాకిస్తాన్ పౌరులను గుర్తించి వెనక్కి పంపే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే... వారు కేంద్రంతో సహకరించాలి.. తెలంగాణలో కాంగ్రెస్ చేసిన కులగణనకి కేంద్ర చేసే గణన కి చాలా తేడా ఉంటది.. ఆరు గ్యారంటీలను అమలు చేయలేక పోయింది రేవంత్ సర్కార్.. తుపాకీ చేతపట్టి అమాయకులను పొట్టనపెట్టుకున్నోళ్లతో చర్చలు ఉండవ్.. మావోయిస్టులను నిషేధించిందే కాంగ్రెస్.. కాంగ్రెస్, బీజేపీ, టీడీపీసహా ఎంతో మంది నాయకులను మందుపాతరలు పెట్టి చంపినోళ్లు నక్సల్స్.. అమాయక గిరిజనులను ఇన్‌ఫార్మర్ల నెపంతో అన్యాయంగా కాల్చి చంపి ఎన్నో కుటుంబాలకు మానసిక క్షోభ మిగిల్చినవాళ్లు మావోయిస్టులు. తుపాకీ వీడనంత వరకు మావోయిస్టులతో చర్చల ఊసే ఉండదు.. కేంద్ర కులగణన నిర్ణయం చారిత్రాత్మకం.. కాంగ్రెస్ విజయమని చెప్పడం విడ్డూరం.. కాంగ్రెస్ కులగణన సర్వేకు, మోదీ కులగణనకు పొంతనే ఉండదు.. కాంగ్రెస్ కులగణనతో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగింది.. బీసీల జనాభాను తగ్గించి చూపారు.. కాంగ్రెస్ మాయమాటలను జనం నమ్మడం లేదు.. 6 గ్యారంటీల అమలులో వైఫల్యాన్ని పక్కదోవ పట్టించేందుకే కాంగ్రెస్ డ్రామాలాడుతోందన్నారు.

పాస్ పోర్టు లేని విదేశీయులను గుర్తించి పంపిస్తున్నామన్నారు. రోహింగ్యాలపై కాంగ్రెస్ వైఖరి ఏమిటో చెప్పాలి. శాంతి భద్రతల సమస్యను రాజకీయం చేయడం సరికాదన్నారు. కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చినా చర్యలెందుకు తీసుకోవడం లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే.. ఆ రెండు పార్టీలు సిగ్గు లేకుండా మావోయిస్టులతో చర్చలు జరపాలని పోటీలు పడుతున్నారన్నారు.. నక్సల్స్ తో మాటల్లేవు... మాట్లాడుకోవడాల్లేవ్ అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.